ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 **శ్రీ సత్యసాయి** జిల్లా వార్తలు

శనివారం 13 సెప్టెంబరు 2025

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 22.0

జిల్లా ప్రజల ప్రేమ మరువలేనిది

● బదిలీ అయిన కలెక్టర్ టీఎస్ చేతన్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆర్డీఓలు, ఉద్యోగులు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల ప్రేమాభిమానాలు మరవలేనివని బదిలీ అయిన కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయన్ను రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తాను కలెక్టర్‌గా పని చేసిన 14నెలల కాలంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మద్దతుతో అనేక అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒకరికి కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ కలెక్టర్ సత్యసాయి శతజయంతి ఉత్సవాల వరకు పనిచేసి ఉంటే బాగుండేదన్నారు. అయినా జిల్లా అభివృద్ధికి ఆయన తనదైన ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీవోలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, ఆనంద్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు షైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన కలెక్టర్ బాధ్యతలు స్వీకరణ



కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా నూతన కలెక్టర్‌గా ఎ. శ్యామ్‌ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఆర్వో శుక్రవారం తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్ బదిలీ కాగా, ఆయన స్థానంలో పార్వతీపురం మన్యం కలెక్టర్‌గా పనిచేస్తున్న శ్యామ్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

టీచర్ల జాబితా సిద్ధం ?

(6లో...)

ప్రైవేట..!

కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం





ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేటు దందా

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో వారే కీలకం

- పైసలిస్తే ఏపనైనా క్షణాల్లో పూర్తి
- వారాంతంలో కలెక్షన్ మొత్తం పెద్దసారుకు ?
- అదుపులేని అవినీతిపై క్రయ, విక్రయదారుల ఆందోళన

కదిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు ఉద్యోగులు హల్‌చల్ చేస్తున్నారు. జీతభత్యాలు లేకుండా పని చేస్తూ సర్వం తమ నియంత్రణలో ఉంచుకున్నారు. వీరు లేకుంటే ఆఫీసులో ఏపని జరగదన్న రీతిలో పాతుకుపోయారు. మాన్యువల్ ఈసీలు రాయాలన్నా, ఆర్‌హెచ్‌లు తీయాలన్నా, రిజిస్టర్ అయిన పత్రాలు బయటకు రావాలన్నా, చెక్ సర్టిఫికెట్‌లు వంటి పనులు చేయాలన్నా వీరు ఉండాల్సిందే. దీంతో వారు పనిచేసే సీటు వద్దకు వెళ్లి, వారు చెప్పినంత ఇచ్చుకుని పని చేయించుకోవాలి.

లేదంటే వారాల తరబడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయిన పత్రాలు వారిగా కలెక్షన్లు కూడా ప్రైవేట్ ఉద్యోగులే చూసుకుంటున్నట్లు సమాచారం. డాక్యుమెంట్ రైటర్ల వారిగా కలెక్షన్ చేసి వారాంతంలో పెద్దసారుకు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. రిజిస్టర్ అయిన ప్రతి పత్రానికి పదివేల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రతి రోజు సరాసరి 40 నుంచి 50 రిజిస్ట్రేషన్లు అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇది కేవలం పత్రాలకు మాత్రమే. స్కానింగ్, చెక్ స్లిప్, మాన్యువల్ ఈసీలకు వచ్చే డబ్బు ఎవరి కలెక్షన్ వారిదే. వచ్చే కలెక్షన్‌లో కార్యాలయ ఖర్చులు, పైకి, కిందికితో పంపకాలతోపాటు ఇతర ఖర్చులు కూడా ఇందులోనే సర్దుబాటు చేస్తారు. ఈకార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల కంటే ప్రైవేటు ఉద్యోగులకే ఎక్కువ ఆదాయం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేసే కొందరు ఉద్యోగులు గత ఎన్నికల్లో కూడా ఓ పార్టీ అభ్యర్థికి లక్షల్లో సాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ చేరిన అనతి కాలంలోనే భారీగా ఆస్తులు సంపాదించినట్లు సమాచారం. ఇలా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు తిష్ట వేసి, వేటాడి ఆదాయాన్ని సంపాదిస్తున్నా వారి గురించి తనకు తెలియదని సబ్ రిజిస్ట్రార్ చెప్పడం గమనార్హం.

నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్

సబ్‌రిజిస్ట్రార్ కార్యాయానికి రిజిస్ట్రేషన్‌కు వస్తే మొదట డాక్యుమెంట్ రైటర్ వద్దకు వెళ్తారు. వారు అవసరమైన పత్రాలు అన్ని పరిశీలించి, క్రయ, విక్రయదారుల వివరాలు, ఆస్తి వివరాలు పొందుపరుస్తూ డాక్యుమెంట్ (రిజిస్ట్రేషన్ పత్రం) తయారు చేస్తారు. అక్కడి నుంచి ఆ పత్రాన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తెస్తారు. అక్కడ సబ్‌రిజిస్ట్రార్ రికార్డులు పరిశీలించి రిజిస్ట్రేషన్‌ను అనుమతి ఇస్తారు. ఆ తరువాత వేలిముద్రలు తీసుకొని, సంతకాలు చేయించుకుంటారు. అనంతరం రిజిస్ట్రేషన్ అయిన పత్రాలు అయా యాజమానులకు అందజేస్తారు. ఇది సాధారణ పద్ధతి. అయితే కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు తమ వ్యక్తులను నియమించుకొని, వారిని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపుతారు. అక్కడ ఉన్న ప్రైవేటు ఉద్యోగులతో కలిసి దందాలు మొదలు పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు పంపిన పత్రాలు నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ అవుతాయి. మరి కొంతమందికి అయితే గంటల తరబడి పనికాదు. ఇక్కడ ప్రైవేటు ఉద్యోగులు కీలకంగా పనిచేసి కొంతమంది డాక్యుమెంట్ రైటర్ల పత్రాలను త్వరగా చేసే విధంగా పని చేస్తున్నట్లు తెలిసింది. భూముల్లో కొన్ని లోటుపాట్లు ఉన్నా ప్రత్యేకంగా మాట్లాడుకొని రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిసింది. అలా చేసిన వారిపై గతంలో కేసులు నమోదు అయ్యాయి. కొంతమంది రాజకీయ నాయకుల అండతో కేసుల నుంచి తప్పించుకున్నట్లు సమాచారం.

వీక్లీ కలెక్షన్

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసే కొంత మంది ప్రైవేటు ఉద్యోగులు రిజిస్ట్రేషన్ అయిన పత్రాల వారిగా వీక్లీ కలెక్షన్‌లు చేస్తున్నట్లు సమాచారం. వారంలో జరిగిన రిజిస్ట్రేషన్‌లన్నింటిని కలిసి డాక్యుమెంట్ల వారిగా కలెక్షన్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. వచ్చిన మొత్తాన్ని పెద్దసారుకు చెప్పి, ఆసొమ్ము ఎక్కడికి పంపాలో రాసుకొని వారికి భద్రంగా చేరుస్తున్నట్లు సమాచారం. మిగిలిన సొమ్ము కార్యాలయ ఖర్చులు పోను పెద్దసారు ఉంచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. ఇవే కాకుండా ఆస్తుల అవకతవకలు, వివాదాలు ఉన్న వాటికే లక్షల్లో వసూలు చేసుకుంటున్నట్లు తెలిసింది. అయితే ఇటువంటివి నేరుగా డాక్యుమెంట్ రైటర్ ద్వారా పెద్ద సారు డీల్ చేసుకుంటాడని తెలిసింది. ఇటీవలే ఓ వివాదం ఉన్న భూమిని కదిరిలో కాకుండా కళ్యాణదుర్గంలో రిజిస్ట్రేషన్ చేసుకొన్నట్లు సమాచారం.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు



ఏ సీటు పనికి ఆ సీటు వద్దే కలెక్షన్

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీటు వద్ద పని ఉంటే ఆ సీటు వద్దే కలెక్షన్ కట్టాలి. ఇది ఆపని చేసినవారికే వెళుతుంది. ముఖ్యంగా ప్రైవేటు ఉద్యోగులే ఈకలెక్షన్లు చేస్తున్నట్లు క్రయ, విక్రయదారులు చెబుతున్నారు. గతంలో రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగా ఉన్నాయా, లేదా, రిజిస్ట్రేషన్ ఫలానా ఆస్తి అవుతుందా లేదా అన్న విషయాలు తెలుసుకోవడానికి ప్రభుత్వానికి రూ.200 ఫీజు చెల్లించాలి. అయితే ఇక్కడ పని కావాలంటే మరో మూడు వందలు అధికంగా చెల్లించాలి. రిజిస్ట్రేషన్ అయినా పత్రాలు ఇవ్వడానికి కనీసం వారం పడుతుంది. వెంటనే కావాలంటే వెయ్యి వరకు చెల్లించాల్సిందే. వారం తరువాతైనా పత్రాలు కావాలంటే స్కానింగ్ చార్జిల కింద కనీసం రూ.500లు ఇవ్వాల్సిందే. ఇక భూములకు సంబంధించి రికార్డు అవసరమైతే ఆర్‌హెచ్ కోరతారు. అవి కావాలంటే వేలల్లో చెల్లించాలి. ప్రభుత్వ ఫీజు మాత్రం వందల్లో ఉంది. ఇక్కడ మరో మతలబు ఉంది. పాత రికార్డులు కనబడకుండా చేయాలంటే రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో కుటాగం

ళ్లకు చెందిన ఓ వ్యక్తి భూమి రికార్డు లేకుండా చేయడానికి ఇక్కడ పనిచేసే ప్రభుత్వ ఉద్యోగి లక్షలు తీసుకున్నట్లు తెలిసింది. ఇది తెలుసుకొని ఆ భూ యజమాని అధికారులను నిలదీసినట్లు సమాచారం. దీన్ని అలుసుగా తీసుకొని గతంలో ఇక్కడ పనిచేసిన అధికారి ఆ ఉద్యోగి వసూలు చేసిన డబ్బులో వాటా తీసుకున్నట్లు తెలిసింది. మాన్యువల్ ఈసీలు అవసరమైతే వారాలు కొద్ది తిరగాలి. అయితే ఇక్కడ అంతో ఇంతో చెల్లిస్తే మూడు రోజుల్లో కావలసిన ఈసీ చేతికొస్తుందని క్రయ, విక్రయదారులు చెబుతున్నారు. ఈకార్యాయలంలో వందల్లో అయ్యే పనులకు వేలల్లో చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ అక్రమాలపై ఎమ్మెల్యే కందికుంట హెచ్చరించినా ప్రయోజనం లేదని క్రయవిక్రయదారులు వాపోతున్నారు.

నాకు తెలియదు

మా కార్యాలయంలో ప్రైవేటు ఉద్యోగులు ఉన్నట్లు నాకు తెలియదు. నేను వచ్చిన తరువాత ఎవరిని తీసుకోలేదు. అలాంటి వారు ఉంటే వెంటనే తొలగిస్తా. అవినీతిపై క్రయ, విక్రయదారులు ఎవరు నాకు ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదులు వస్తే వెంటనే చర్య తీసుకుంటా.

- వీరనారాయణ, సబ్‌రిజిస్ట్రార్, కదిరి



జిల్లా కేంద్రంలో కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఉచిత ఆరోగ్య బీమా ఇవ్వాలి

● బార్ అసోసియేషన్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు ఉచిత ఆరోగ్యబీమా వర్తింపచేయాలంటూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి డిమాండ్ చేశారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు వారు తమన్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలంటూ శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ న్యాయవాదులకు ఉచిత ఆరోగ్య బీమా కార్డులు మంజూరు చేయాలని, తద్వారా అనారోగ్య సమస్యలతో బాధపడే న్యాయవాదులకు ఆరోగ్య సంరక్షణ చేకూరుతుందన్నారు. బార్‌కౌన్సిల్ నేతృత్వంలో అడ్వకేట్ వెల్ఫేర్ డెత్ బెనిఫిట్ రూ. 10లక్షలకు పెంచాలని, మరణించిన న్యాయవాదులకు మాచింగ్‌గ్రాంట్ రూ. 4లక్షలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించేంత వరకు తమ నిరసనలను వివిధ రూపాలలో కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లెక్కల యదుభూషణ్, కృష్ణప్రసాద్, నాగేంద్ర, రాజ్‌గోపాల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పాపం.. పసివాడు..!

ప్రాణం తీసిన వాటర్ బాటిల్ క్యాప్

ఏడాదిన్నర పసివాడు.. ఆడుకుంటూ వాటర్ బాటిల్ క్యాప్ మింగేశాడు. ఊపిరి ఆడక ప్రాణాలను విడిచాడు. ఈ విషాద సంఘటన గుత్తి పట్టణ సమీపంలోని ఎన్‌పీటీసీ ట్రాన్స్‌కో విభాగంలో చోటు చేసుకుంది. నైట్ షిష్ట్ ఉండటంతో పసివాడిని వెంట తీసుకువెళ్లిన తల్లి.. అంతులేని విషాదాన్ని మూటగట్టుకున్నారు.

(వివరాలు మెయిన్‌లో..)

ఏళ్లు గడిచినా..!

ఉబిచెర్లలో అద్దె భవనంలోనే ఆస్పత్రి

● భవనం అప్పగించని కాంట్రాక్టర్ ● ఇబ్బంది పడుతున్న వైద్యులు, రోగులు



ఉబిచెర్ల హెల్త్ క్లినిక్‌లో నివాసమున్న దృశ్యం

నల్లచెరువు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అద్దె భవనంలో ఆస్పత్రి నిర్వహిస్తుండటంతో వైద్య సిబ్బందితో పాటు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఉబిచెర్ల గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం పూర్తయి రెండున్నరేళ్లు గడిచినా అది వినియోగంలోకి రాలేదు. కాంట్రాక్టర్ తాళాలు అప్పగించకపోవడంతో అద్దె భవనంలోనే ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. దీంతో లక్షల ప్రజాధనంతో నిర్మించిన భవనం అందుబాటులో ఉన్నా అద్దె భవనంలో ఆస్పత్రి నిర్వహించడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల గడిచినా కాంట్రాక్టర్ భవనం అప్పగించకపోవడంతో కొన్ని రోజుల కిందటి వరకు ఓ ప్రభుత్వ పాఠశాలలోని ఓ గదిలో వైద్యం సేవలు అందించేవారు. అక్కడ విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఆగదిని ఖాళీ చేయించారు. దీంతో ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని అందులో ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మందులు, మాత్రలు ఇతర వైద్య సామగ్రి భద్రపరుచుకోవడం కష్టమవుతోందని వైద్య సిబ్బంది చెబుతున్నారు.



ప్రైవేట్ భవనంలో చికిత్సలు చేస్తున్న వైద్యసిబ్బంది



పూర్తయిన హెల్త్ క్లినిక్ భవనం

తాళాలు ఇచ్చినట్లే ఇచ్చి..

వైసీపీ పాలనలో ఉబిచెర్ల గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి రూ.17లక్షలు మంజూరు చేశారు. ఈ భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.1.2లక్షల బిల్లులు బకాయి పడ్డాయి. దీంతో ఆయన ఆ భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా తాళాలు వేశాడు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనాలు రావడంతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పందించి, భవనాలను పరిశీలించి, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. దీంతో కాంట్రాక్టర్ భవనం తాళాలు అధికారులకు అప్పగించారు. అయితే రోజులు బాగాలేవని శ్రావణమాసం తరువాత అప్పగిస్తామని అధికారుల నుంచి తాళాలు వెనక్కు తీసుకున్నారు. శ్రావణమాసం తరువాత అదికారులుకానీ, కాంట్రాక్టర్‌కానీ భవనాల గురించి పట్టించుకోలేదు. కిందిస్థాయి సిబ్బంది వెళ్లి కాంట్రాక్టర్‌ను అడగ్గా, బిల్లులు వచ్చేంత వరకు ఎలాంటి తాళాలు ఇవ్వనని, ఇక్కడ ఉండటానికి వీలులేదని చెప్పినట్లు తెలిసింది. కాగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లోని ఓ గదిలో ఓ మహిళ నివాసం ఉంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

తాళాలు వేయడం మంచిది కాదు: రామకృష్ణ, ఉబిచెర్ల



విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం పూర్తయ్యి ఏళ్లు గడిచినా ప్రభుత్వానికి అప్పగించకపోవడం ఏమిటి? వైసీపీ పాలనలో బిల్లులు రాకపోతే భవనానికి ఇప్పుడు తాళాలు వేయడం మంచిది కాదు. బిల్లులు రాకపోతే అధికారులతో చర్చించాలేకానీ, అందరికి ఉపయోగపడే హెల్త్ సెంటర్‌కు ఇలా తాళాలు వేయడం సరికాదు. అధికారులు వెంటనే భవనాన్ని స్వాధీనం చేసుకుని, వైద్యసేవలు అందించాలి.

సంతకం చేశా: డాక్టర్ అలేఖ్య

హెల్త్ క్లినిక్ సెంటర్‌ను అప్పగిస్తున్నట్లు సంతకం చేయించుకున్నారు. తాళాలు ఇచ్చారు. తరువాత రోజులు బాగాలేవని, శ్రావణమాసంలో ఇస్తామని తాళాలను కాంట్రాక్టర్ తీసుకున్నారు. ఇంతవరకు భవనాలు స్వాధీనం చేయలేదు.

● కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఉబిచెర్ల హెల్త్‌క్లినిక్ భవనాలు స్వాధీనం చేసుకుంటామని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త తెలిపారు.





భార్యను చంపేసి.. వంకలో పూడ్చేశాడు..!

రెండు నెలల తరువాత వెలుగులోకి ఘటన

వివాహేతర సంబంధమే కారణం

పోలీసుల అదుపులో భర్త, స్నేహితుడు

(వివరాలు 6వ పేజీలో....)

వైసీపీ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి

7లో

హ్యాకథాన్ పోటీల్లో సత్తా

రిజర్వాయర్ పేరిట రైతుల భూములు

● పరిహారం ఇవ్వకనే రికార్డు నుంచి రైతుల పేర్లు తొలగింపు

● తోపుదుర్తి అన్నదాతల గోడు పట్టని అధికారులు

6లో

గాయపడిన **మహిళ మృతి**

16 రోజుల చికిత్స అనంతరం..

(7లో)

రిజర్వాయర్ పేరిట భూములు

పరిహారం ఇవ్వకనే రికార్డుల నుంచి రైతుల పేర్ల తొలగింపు

- తోపుదుర్తి అన్నదాతల గోడు పట్టని అధికారులు
- పరిహారం, రుణాల రెన్యువల్‌కు ఇబ్బందులు

రుణాల రెన్యువల్‌కు వన్‌బీ తప్పనిసరి



బ్యాంకులో రుణం తీసుకున్నా. లోన్ రెన్యువల్ చేయాలంటే బ్యాంకు అధికారులు వన్‌బీ, అడంగల్ అడుగుతున్నారు. దీంతో మూడేళ్లుగా బ్యాంకుకు వెళ్లలేకపోతున్నా. రికార్డుల్లో మా పేర్లు రావడం లేదు. దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మాగోడు పట్టించుకునేవారే లేరు. రైతులు పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. అధికారులు చర్యలు తీసుకొని రికార్డుల్లో రైతుల పేర్లు నమోదు చేయాలి.

- లింగమయ్య, రైతు, తోపుదుర్తి



రిజర్వాయర్ నిర్మాణం చేయడానికి ప్రతిపాదించిన చిన్న చెరువు

ఆత్మకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రిజర్వాయర్ పేరుతో తమను నిండా ముంచారని మండలంలోని తోపుదుర్తి గ్రామ రైతులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తోపుదుర్తి రిజర్వాయర్ పేరుతో 714 ఎకరాలను రిజర్వాయర్ ముంపు ప్రాంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పరిహారం ఇవ్వకుండానే రికార్డుల నుంచి రైతుల పేర్లు తొలగించారు. దీంతో బ్యాంకుల్లో రుణాల రెన్యువల్ కాక రుణభారం పెరిగిపోతోందని రైతులు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారేలేరు. గత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత గ్రామంలోనే తమకు అన్యాయం చేశారని రైతులు వాపోతున్నారు. 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి మంత్రి పరిటాల సునీత పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీటితో నింపాలని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రూ.803 కోట్లతో కాలువ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించి 70 శాతం పైగా పనులు చేయించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఎన్నికయిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేరూరు కాలువ ద్వారా కొత్త డ్యాంల పేరుతో ముట్టాల, తోపుదుర్తి రిజర్వాయర్లు తెరపైకి తెచ్చారు. కనీసం తట్టెడు మట్టి తీయకుండా దగా చేసి వెళ్లారని రైతులు వాపోతున్నారు. తోపుదుర్తిలో చిన్న చెరువు 57 ఎకరాలు, పెద్ద చెరువు 148 ఎకరాలు భూమి ఉంది. ఆ భూమితో పాటు మరో 714 ఎకరాలు సేకరించి రిజర్వాయర్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రైతుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు సేకరించి రెవెన్యూ అధికారులతో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి వదిలేశారు. వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం పరిహారం కోసం ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది. రిజర్వాయర్ పరిస్థితి దేవుడికెరుక కనీసం ఆన్‌లైన్‌లో తమపేర్లు కొనసాగించి అడంగల్, వన్ బీ అయినా ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నా వాటికి విలువలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు చెరువులు కలుపుతూ రిజర్వాయర్ పరిధిలో భూములు కలిగిన రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని భూములను యథాతథగా రికార్డుల్లో కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.



రిజర్వాయర్ కోసం సేకరించిన భూమిని చూపుతున్న రైతులు

పరిహారం రాలేదు



రిజర్వాయర్ వస్తుందని రెవెన్యూ అధికారులు మా నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకున్నారు. రిజర్వాయర్ రాలేదు, పరిహారమూ మంజూరు కాలేదు. రికార్డుల్లో మా పేర్లు కూడా లేవు. కనీసం భూములు ఉన్నాయని చెప్పుకోవడానికి ఎలాంటి ఆధారం లేకుండా పోయింది. ఎక్కడా మాపేర్లు లేవు. నాకు 4.80 ఎకరాల భూమి ఉంది. దానికి పరిహారం రాలేదు, రికార్డుల్లో లేకుండా పోయింది. మేమెవరిని అడగాలి.

- శ్రీరాములు, రైతు, తోపుదుర్తి

కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి



తోపుదుర్తి రిజర్వాయర్ గ్రామ రైతులను ఊరించింది. చాలామంది రైతులు భూములు రిజర్వాయర్‌కు ఇచ్చారు. ఇంతవరకు రిజర్వాయర్ నిర్మాణం జరగలేదు. రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో రావడంలేదు. ప్రభుత్వం నుంచి సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు రావడం లేదు. బ్యాంకులో రుణాల రెన్యువల్ కావడం లేదు. మా బాధలు తీర్చేవారే లేరు. కూటమి ప్రభుత్వం, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవ చూపి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాను.

- రాజేష్, రైతు, తోపుదుర్తి

ఆరోగ్యవంతమైన కుటుంబమే లక్ష్యం



జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన కుటుంబ నిర్మాణమే లక్ష్యంగా ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్ఓ తన కార్యాలయం నుంచి డాక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 17నుంచి అక్టోబరు 2వరకు సమగ్ర, ఆరోగ్య ప్రచార, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, సమయానుకూల వైద్యసేవలు, పోషక ఆహారాన్ని ప్రోత్సహించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబ నినాదం తీసుకు వచ్చారని తెలిపారు. జిల్లాలోని 45 ప్రాథమిక, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 433 ఆరోగ్య ఉపకేంద్రాలు, మూడు ఏరియా ఆసుపత్రులు, ఏడు సామాజిక ఆరోగ్య కేంద్రాలతోపాటు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిధిలోని డాక్టర్లు, సిబ్బంది భాగస్వామ్యం కావాలని తెలిపారు. పంచాయతీరాజ్, మున్సిపల్, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.

జిల్లా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ నియామకం



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న జిల్లా కార్యదర్శి రమ

అనంతపురం విద్య, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయానికి అభివృద్ధి కమిటీని నియమించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ వర్గాల సభ్యులతో కార్యదర్శి రమ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కమిటీ నిబంధనలు, కార్యక్రమాలు గురించి చర్చించారు. కన్వీనర్‌గా డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, కమిటీ సభ్యులుగా రవికాంత్ క్యాటరింగ్ రమణ, కేఎస్ఆర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బృందా, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీరాములు, రామరత్నం, రచయిత రామలింగయ్య, విశ్రాంత డీఎస్పీ హరి, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్‌ను నియమించారు. నూతన కమిటీని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ అభినందించారు.

టీచర్ల జాబితా సిద్ధం ?

- నేడు జిల్లా కమిటీ ఆమోదానికి డీఎస్సీ ఎంపిక తుది జాబితా



ఇన్‌చార్జ్ డీఈఓ మల్లారెడ్డిని కలిసిన అభ్యర్థి రమ్యశిల్ప

అనంతపురం విద్య, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ సెలెక్ట్ జాబితా సిద్ధమైంది. దాదాపు పక్షం రోజులుగా రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో కమిషన్ కార్యాలయంలోనే ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తూ వచ్చారు. అక్కడ నుంచే సెలెక్ట్‌కు అవకాశం ఉన్న అభ్యర్థులను గుర్తించి కాల్ లెటర్లు పంపారు. ఆ కాల్‌లెటర్లు అందుకున్న అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో చేపట్టారు. ఆ సర్టిఫికెట్లలో బోగస్ ఉండకూడదని ఐదారుసార్లు ప్రత్యేక కమిటీలతో పరిశీలింపజేశారు. ఉమ్మడి జిల్లాలో అన్నికేడర్‌లకు సంబంధించి 807 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి, డీఎస్సీ నిర్వహించారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 776మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు సమాచారం. మిగిలిన 31 పోస్టులకు ఆయా కేటగిరీల్లో అభ్యర్థులు లేరని తెలిసింది.

● అనంతకు జాబితా

మిగిలి పోస్టులకు మినహా ఇతర పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పూర్తి కావడంతో జాబితాను సిద్ధం చేసి జిల్లా కమిటీ ఆమోదం కోసం డీఈఓ ప్రసాద్‌బాబుకు అప్పగించినట్లు సమాచారం, ఆయన ఐదురోజులుగా రాజధానిలోనే ఉన్నారు. ఆయన శనివారం జిల్లాకు వచ్చిన తర్వాత రాష్ట్రశాఖ ఎంపిక చేసిన డీఎస్సీ అభ్యర్థుల జాబితాకు జిల్లా కమిటీ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ కూడా శనివారం పూర్తి కావాలని కమిషనర్ ఆదేశించడంతో ముందుగానే కలెక్టరు, జడ్పీ సీఈఓ, మున్సిపల్ ఆర్డీ, వెల్ఫేర్‌శాఖల అధికారులు, గురుకులాల డీసీఓలకు సమాచారం పంపారట. వీరందరూ అందుబాటులో ఉండి డీఎస్సీ జాబితాను రోస్టర్, మెరిట్ ఆధారంగా మరోసారి పరిశీలించుకొని జాబితాకు జిల్లా సెలెక్షన్ కమిటీ ఆమోదం వేసి పంపాలని సూచనలు వచ్చాయి. ఆమేరకు జిల్లా విదాశాఖ యంత్రాంగం కబురు పంపింది. కాగా నేడు రెండోశనివారం అయినా విద్యాశాఖ అన్నిసెక్షన్ల అదికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ఆర్జేడీ, డీఈఓలు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శనివారం రాత్రి కల్లా డీఎస్సీ-2025 సెలెక్ట్ అభ్యర్థుల ఫైనల్ లిస్టు ఓకే కానుంది. ఆతర్వాత జాబితాను రాష్ట్ర అధికారులు ప్రకటించనున్నారు.

● వెరిఫికేషన్‌కు వచ్చిన రమ్యశిల్ప

డీఎస్సీ సెలెక్ట్ జాబితా తయారీలో చివరగా ముగ్గురు అభ్యర్థులకు కాల్‌లెటర్లను రాష్ట్ర శాఖ గురువారం పంపింది. వీరి సర్టిఫికెట్లను సాయంత్రంలోగా వెరిఫికేషన్ చేసి నివేదిక పంపాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో విద్యాశాఖ యంత్రాంగం వారికి ఫోన్‌లు చేసి మీకు కాల్‌లెటర్లు వచ్చాయి, మీ ఒరిజన్ సర్టిఫికెట్లు తీసుకొని డీఈఓ ఆఫీస్‌కు రావాలని సూచించారు. ఇద్దరు అందుబాటులోకి రాగా రమ్యశిల్ప అనే అభ్యర్థి కోయంబత్తూరులో ఉన్నట్లు చెప్పారు. ఒకవేళ హాజరుకాకపోతే తన పోస్టుకు ఇబ్బంది వస్తుందేమానని వీడియా కాల్ ద్వారా కోయంబత్తూరు నుంచి మాట్లాడడంతో పాటు ఆవీడియోను డీఈఓకు పంపారు. అధికారులు అవకాశం ఇవ్వడంతో శనివారం రమ్యశిల్ప కోయంబత్తూరు నుంచి డీఈఓ ఆఫీస్‌కు చేరుకొని ఇన్‌చార్జ్ డీఈఓ మల్లారెడ్డి, ఐటీసెల్ ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్‌లను కలిశారు. అనంతరం కమిటీ సభ్యులను పిలిపించి ఆమె సర్టిఫికెట్లను వెరిపికేషన్ చేయించి అప్‌లోడ్ చేసి రాష్ట్రశాఖకు పంపారు.

చీనీ టన్ను రూ.16వేలు



అనంతపురం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధరరూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 125టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

డీఎఫ్ఓ చక్రపాణికి ఉద్యోగోన్నతి



డీఎఫ్ఓ చక్రపాణి

బుక్కపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా అటవీ శాఖాధికారిగా పని చేస్తున్న చక్రపాణికి ఉద్యోగోన్నతి లభించింది. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా ఉన్న ఆయనకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(డీసీఎఫ్)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చక్రపాణి జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్ఓగా ఏడాది నుంచి కొనసాగుతున్నారు. అనంతపురం జిల్లాకు సామాజిక వన విభాగం అటవీ శాఖాధికారిగా గురు ప్రభాకర్‌ను నియమించారు. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా పని చేస్తున్న ఈయనకు ఉద్యోగోన్నతి కల్పించి అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు.

రెండు జిల్లాలకు డీఎఫ్ఓల నియామకం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం, సత్యసాయి జిల్లాలకు జిల్లా అటవీశాఖాధికారులను ప్రభుత్వం నియమించింది. అనంతపురం డీఎఫ్ఓగా గురుప్రభాకర్, సత్యసాయి డీఎఫ్ఓగా శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వుల వెలువడ్డాయి. ఇటీవల అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(ఏసీఎఫ్) స్థాయి అధికారులకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(డీసీఎఫ్)గా ప్రభుత్వం తాత్కాలిక ఉద్యోగోన్నతులు కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా చాలా మందికి ఏసీఎఫ్‌లకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారులుగా ఉద్యోగోన్నతి ఇచ్చింది. కొత్తగా ఉద్యోగోన్నతి పొందిన డీసీఎఫ్‌లను పలు జిల్లాలో ఖాళీగా ఉన్న జిల్లా పారెస్ట్(డీఎఫ్ఓ) అధికారులుగా నియమించింది. ఈ క్రమంలో అనంతపురంలో డీఎఫ్ఓ పోస్టు ఖాళీగా ఉండటంతో గురుప్రభాకర్‌ను, సత్యసాయి జిల్లా డీఎఫ్ఓగా శ్రీనివాసులును నియమించింది.



మరువ పారుతున్న గుత్తి చెరువు

నిండిన గుత్తి చెరువు

- పారుతున్న మరువ

గుత్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుసిన భారీ వర్షాలకు గుత్తి చెరువు నిండి మరువ పారుతోంది. భారీ వర్షాలకు మండలంలోని పలు వంకలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతంలో ఉన్న నంద్యాల జిల్లా ప్యాపిలి, కర్నూలు జిల్లా జొన్నగిరి, ఎర్రగుడి తదితర ప్రాంతాల నుంచి వర్షపు నీరు పెద్ద ఎత్తున వంకల ద్వారా చెరువుకు చేరుతోంది. దీంతో గుత్తి చెరువు నిండి కళకళలాడుతోంది. చెరువు మరువ పారుతుండటంతో మత్స్యకారులు గంగమ్మ పూజ నిర్వహించారు. చెరువు నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొందరు యువకులు ఉత్సాహంగా చేపలు పడుతున్నారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర మహాసభలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గణేనాయక్ భవన్‌లో యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలనే డిమాండ్‌ను ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని మండిపడ్డారు. పథకాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు బడ్జెట్ పెంచాలన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర మహాసభలకు యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని మెస్సా ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కళల్లో రాణించాలి

బుక్కపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మక కళల్లో రాణించాలని బీసీ సంక్షేమశాఖ అధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండు రోజులుగా కళా ఉత్సవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి 396 మంది విద్యార్థులు ఆరు విభాగాల్లో ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మక కళలను పెంపొందించుకోవడానికి కళా ఉత్సవ పోటీలు చక్కటి అవకాశం అన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఆరు విభాగాల్లో.. గాత్ర సంగీతంలో ఎం. దీపిక (అనంతపురం), హర్షిణి (ధర్మవరం), వాద్య సంగీతం నుంచి వేదవ్యాస్ (రొద్దం), హర్షిత (హిందూపురం) ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నృత్యంలో మైథిలీ (దాడితోట), నాటకంలో గజాల గ్రూపు (ఆత్మకూరు) దృశ్య కళలు కారుణ్య (బుక్కపట్నం), కిరణ్మయి (లేపాక్షి), వరుణ్‌సందేశ్ (గోరంట్ల) రాణించారు. అదే విధంగా సంప్రదాయ కథనంలో షణ్ముక (రేకులకుంట) జిల్లా స్థాయిలో అత్యుతమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డైట్ ప్రినిపాల్ పేర్కొన్నారు. అనంతరం బహుమతులను ప్రదానం చేశారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఆరోగ్యాన్ని అందించే డాక్టర్లు వ్యాయామ టీచర్లు

- ఉత్తమ పీడీల సన్మానసభలో కాలవ



ఉత్తమ అవార్డులు పొందిన వ్యాయామ టీచర్లతో కాలవ శ్రీనివాసులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠాలు చెప్పి విజ్ఞానాన్ని పెంచితే.. వ్యాయామ టీచర్లు ఆటలు ఆడించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడే డాక్టర్లని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కొనియాడారు. ఇటీవల గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు పొందిన పీఈటీలు, పీడీలకు ఏపీపీఈటీ, ఎస్ఏపీఈల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ భవన్‌లో సన్మానించారు. కార్యక్రమానికి కాలవ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ పీడీలు, పీఈటీలను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం చాలా ముఖ్యం అన్నారు. ఆటల వల్ల పిల్లలలో మానసిక ఉల్లాసం ఏర్పడి ఆరోగ్యంగా బాగుంటారని అన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రామక్రిష్ణ, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరామిరెడ్డి, పీఈటీల సంఘం అధ్యక్షుడు అక్కులప్ప, వ్యాయామ టీచర్లు నాగరాజు, సత్యనారాయణ, సుగుణమ్మ, శకుంతల, పార్వతి, నాగమణి, లింగమయ్య, సిరాజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపేసి.. వంకలో పూడ్చేశాడు..!

రెండు నెలల తరువాత వెలుగులోకి ఘటన

వివాహేతర సంబంధమే కారణం

పోలీసుల అదుపులో భర్త, స్నేహితుడు



కాలనీలో ప్రజలను విచారిస్తున్న పోలీసులు

ధర్మవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్యను ఓ వ్యక్తి గొంతు నులిమి చంపేశాడు. స్నేహితుడి సాయంతో ఆమె మృతదేహాన్ని వంకలో పూడ్చిపెట్టాడు. రెండు నెలలుగా ఆమె కనిపించకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వ్యహారంలో హత్యకు గురైన మహిళ భర్త వెంకటరాముడు, అతని స్నేహితుడు విజయ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు, ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దంపతులు ఆటోలో చిప్స్ అమ్ముకుంటూ జీవించేవారు. వ్యాపారంలో సాయం కోసం ఓ యువకుడిని వీరు తమ ఇంట్లో పెట్టుకున్నారు. ఆ యువకుడు వెంకటరాముడు భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం బయటపడుతుందని భావించిన ఆమె, ఇబ్బంది తలెత్తకుండా తన కూతురును ఆ యువకుడికి ఇచ్చి వివాహం జరిపించారు. ఆ తరువాత కూడా వివాహేతర సంబంధం కొనసాగింది. విషయం తెలుసుకున్న వెంకటరాముడు, భార్య, అల్లుడిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో అదే కాలనీలో ఉంటున్న మరో మహిళతో వెంకటరాముడు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అత్త, అల్లుడు.. ఆ మహిళ కుమారుడిని అపహరించారు. వెంకటరాముడే కిడ్నాప్ చేసినట్లు బాలుడి తల్లిచేత పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ కేసులో వెంకటరాముడు అరెస్టయ్యాడు. బెయిలు మీద రెండు నెలల క్రితం బయటకు వచ్చాడు. కోపంతో తమను ఏమైనా చేస్తాడని భావించిన అల్లుడు, తన భార్యను తీసుకుని అనంతపురానికి మకాం మార్చాడు. అల్లుడిని చంపితే తన కూతురు జీవితం అంధకారమవుతుందని భావించిన వెంకటరాముడు, భార్యను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. రెండు నెలల క్రితం ఓ రాత్రి ఆమె గొంతు నులిమి చంపేశాడు. అనంతరం తన స్నేహితుడు విజయ్‌కి ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకున్నాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. మృతదేహాన్ని బైకుపై తీసుకువెళ్లి గొల్లపల్లి సమీపంలోని వంకలో పూడ్చేశారు. ఆ తరువాత వెంకటరాముడు ఏమీ జరగనట్లు తన పని తాను చేసుకుంటున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. గొల్లపల్లి వంకలో మృతదేహాన్ని పూడ్చిన స్థలాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన గురించి పోలీసులు ఇందిరమ్మ కాలనీకి వెళ్లి విచారించారు.

బొలెరో.. లారీ ఢీ

దొరిగిల్లు వాసి మృతి


ఓం ప్రతాప్(ఫైల్)

తనకల్లు, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముదిగుబ్బ మండలం దొరిగిల్లుకు చెందిన ఓంప్రతాప్ (35) మృతి చెందాడు. మరో వ్యక్తి ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు ముదిగుబ్బ మండలంలోని దొరిగిల్లుకు చెందిన రైతు ఓంప్రతాప్ వ్యవసాయం చేస్తూనే ఓ బొలెరో వాహనం కొనుగోలు చేశాడు. తాను పండించిన టమోటా పంటను కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి సమీపంలో ఉన్న వడ్డిపల్లి మార్కెట్‌కు తరలించేవాడు. అలాగే గ్రామంలో ఇతర రైతుల టమోటాలు కూడా తరలించేవాడు. ఈక్రమంలోనే గ్రామానికి చెందిన రైతు ప్రసాద్ పండించిన టమోటాలను లోడ్ చేసుకుని గురువారం రాత్రి వడ్డిపల్లికి తీసుకెళ్లారు. అక్కడ టమోటాలను అన్‌లోడ్ చేసి, తిరిగి దొరిగిల్లుకు వస్తుండగా తాడిపత్రి నుంచి బెంగళూరుకు సిమెంటును తరలిస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న ఓంప్రతాప్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను వందేమాతరం అంబులెన్స్‌లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాదంలో బొలెరో వాహనం నుజ్జునుజ్జు అయింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, రోడ్డుపై అడ్డంగా పడిన వాహనాలను తొలగించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్టేషన్‌హౌస్ అధికారి నాగసుబ్బయ్య తెలిపారు. మృతుడికి భార్య ఉన్నారు. పిల్లలు లేరు.

తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

మండ్లిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో మరో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. మండ్లిపల్లికి చెందిన 30మంది మహిళా కూలీలు శుక్రవారం తెల్లవారుజామున ఆటోలో కూలి పనుల కోసం అన్నమయ్య జిల్లాకు బయల్దేరారు. ప్రమాదానికి గురైన లారీ ముందు భాగంలోనే వీరి ఆటో వెళుతోంది. అయితే ఇంతలోనే ఎదురుగా వస్తున్న బొలెరోను లారీ ఢీకొట్టింది. ఏమాత్రం ఏమరుపాటు జరిగినా ఆటోలోని కూలీల ప్రాణాలు గాల్లో కలిసిపోయేవని చెబుతున్నారు.

కుక్క అడ్డురావడంతో..

పరిగి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిగెనహళ్లి గ్రామానికి చెందిన నాగభూషణం(62) అనే వ్యక్తి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. నాగభూషణం మడకశిర మండలం చందకచర్ల గ్రామంలో వ్యవసాయ పనులు ముగించుకుని, బైక్‌పై స్వగ్రామమైన కొడిగెనహళ్లికి వస్తున్నాడు. పరిగి వద్ద ఉన్న ఇండియన్ గార్మెంట్స్ సమీపంలో ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో తప్పించబోయి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన నాగభూషణంను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

ముగ్గురికి గాయాలు


బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

బెళుగుప్ప, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లి గ్రామ శివార్లలో శుక్రవారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలంలో బోల్తా పడింది. దీంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రాయదుర్గం డిపో నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు నక్కలపల్లి, బెళుగుప్ప గ్రామాల మధ్య పొలంలో బోల్తా పడింది. దీంతో బస్సులోని 20 మంది ప్రయాణికులు ప్రాణభయంతో హాహాకారాలు చేశారు. కాగా డ్రైవర్ అప్రమత్తమై ముందున్న బస్సు అద్దాన్ని పగులగొట్టి ప్రయాణికులను రక్షించారు. స్టీరింగ్ పనిచేయదని చెప్పినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదంటూ గ్రామస్థులతో డ్రైవర్ అంజి, కండక్టర్ రమేష్ వాపోయారు. వీరిద్దరితోపాటు ప్రయాణికురాలు సుంకమ్మ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు బోల్తా విషయం తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్ క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎస్ఐ శివ, ఆర్ఐ నగేష్, వీఆర్వోలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

స్పందించిన రవాణాశాఖ మంత్రి..

ఆర్టీసీ బస్సు బోల్తా పడటంపై రవాణాశాఖమంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు స్పందించారు. ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవాలని ఆదేశించారు.

వేధింపులపై కేసు

ధర్మవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన సాయికీర్తనను భర్త నరేశ్, అత్త వెంకటలక్ష్మి వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. రాజేంద్రనగర్‌కు చెందిన సాయికీర్తన, నరేశ్‌లకు నాలుగు సంవత్సరాల క్రితం వివాహమయింది. వీరికి 14నెలల కుమార్తె ఉంది. వివాహమయినప్పటి నుంచి భర్త నరేశ్ వేధించడంతోపాటు కొట్టి గాయపరిచారు. దీంతో ఆమె పుట్టినిల్లు అనంతపురం వెళ్లిపోయింది. శుక్రవారం సాయికీర్తన భర్త, అత్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి

గార్లదిన్నె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వెనుక వైపు శుక్రవారం రైలు కింద పడి శివ (23) అనే యువకుడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గార్లదిన్నెకు చెందిన రామాంజి కుమారుడు శివ గ్రామంలో కూలీ పనులు చేసుకునేవాడు. మూడు సంవత్సరాలు క్రితం మిద్దెపై నుంచి కిందకు పడడంతో కాలు, చెయ్యి విరిగాయి. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతుండేవాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తిరుపతి నుంచి గుంతకల్లు వైపు వెళుతున్న రైలుకింద పడి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వేధించిన వ్యక్తికి దేహశుద్ధి

గోరంట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె కుటుంబసభ్యులు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడికి గురువారం రాత్రి దేహశుద్ధి చేశారు. గోరంట్లలో పని చేస్తున్న మహిళకు టీడీపీ నాయకుడు ఫోన్ చేసి కొన్నిరోజులుగా వేధించేవాడు. అందరి ఫోన్ నెంబర్లు తనకు తెలుసని, తాను చెప్పినట్లు వినాలంటూ వేధిస్తుండేవాడు. విసిగిపోయిన ఆమె విషయాన్ని భర్తకు తెలిపింది. దీంతో బాధిత మహిళ కుటుంబీకులు టీడీపీ నాయకుడి కోసం గురువారం పగలంతా గాలించారు. రాత్రి కారులో ఇంటికెళ్తుండగా, కదిరి రహదారిలోని పెట్రోల్ బంక్ వద్ద మరో వాహనంలో వెళ్లి అడ్డగించారు. కిందికు లాగి చితకబాదారు. మరో నాయకుడు అడ్డు రావడంతో అక్కడ నుంచి జారుకున్నాడు. బాధితులు మంత్రి సవితకు నేరుగా ఫోన్‌చేసి, ఇలాంటివారు పార్టీలో ఉంటే మీకు, పార్టీకి మంచిదికాదని చెప్పినట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో ఆ టీడీపీ నాయకుడి వేధింపుల దారుణాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. దేహశుద్ధి ఘటనపై పోలీసులను విచారించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

యువతి అదృశ్యం

కదిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం యువతి ఇంటిలో ఉన్న చెత్తను బయటకు పడేసి వస్తానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదన్నారు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

హ్యాకథాన్ పోటీల్లో సత్తా

బహుమతులు ప్రదానం చేసిన రిజిస్ట్రార్


జేఎన్‌టీయూ టీమ్‌కు బహుమతిని అందజేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025 పోటీల్లో జేఎన్‌టీయూఏ ఇంజనీరింగ్ కళాశాలతోపాటు పలు కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. తమ ప్రతిభతో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్ పోటీలను గురువారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి వివిధ డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన టాప్-2 జట్లు పాల్గొన్నాయి. మొత్తం 19 జట్లు హాజరయ్యాయి. పది విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు ప్రారంభించారు. రాత్రి ముగింపు వేడుకల్లో రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వాంటం కంప్యూటింగ్ అనేది కొత్తగా మొదలైన ఒక పరిశోధనా అంశం అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొంటూ మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్లకు రూ.10వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్లకు రూ.5వేలు నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

గెలుపొందిన వారి వివరాలు..

జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఆచార్య కె. మాధవి రెండు టీమ్‌లు మొదటి స్థానంలో నిలిచాయి. ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పల్లవి టీమ్, కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించిన బుక్కిటి, ప్రణవ్ సాయి టీమ్, కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల చరణ్, గంగాశ్రీ జట్లు, శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ రామస్వామి టీమ్, రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల బసిద్ టీమ్ మొదటి స్థానంలో నిలిచాయి. అదేవిధంగా శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ రిశిక్ టీమ్, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సనియా టీమ్, కేవీఆర్ మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యు.భారతి టీమ్, కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల హర్షిత టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

ఎస్కేయూ విద్యార్థుల ప్రతిభ

క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్-2025 సెమీస్‌లో విజయం


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్-2025లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సెమీఫైనల్‌లో రెండు టీమ్‌లు పాల్గొనగా ఇందులో ఒక టీమ్ మొదటి బహుమతి సాధించింది. విద్యార్థులను వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి అభినందించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సెమీఫైనల్ పోటీల్లో విజయం సాధించడంతోపాటు రూ.10వేలు బహుమతి గెలుచుకోవడం అభినందనీయమన్నారు. వీరు అమరావతిలో జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటారని తెలిపారు. రెండో టీమ్ బెస్ట్ ప్రెజెంటేషన్‌లో కన్సలేషన్ బహుమతి పొంది రూ.5వేలు అందుకుందన్నారు. రెండు టీమ్‌లలో సఫాన్, ధరణి బెస్ట్ ప్రోగ్రామర్స్‌గా ఎన్నుకోబడ్డారన్నారు. విద్యార్థుల విజయంలో సాంకేతిక సహకారం అందించిన అధ్యాపకులు కుల్ దీప్, నరసింహులు, శారద, రాజేష్‌లను వీసీ అభినందించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎస్కేయూ ఔన్నత్యం

- ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఔన్నత్యాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అనిత పిలుపునిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ శిబిరాల్లో విజేతలైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పలువురు ప్రొఫెసర్లు శుక్రవారం అభినందించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాణించడం ప్రశంసనీయమన్నారు. కర్ణాటకలోని మంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన ఐకాన్ అంతర్జాతీయ శిబిరంలో పాల్గొని మూడు ఈవెంట్లలో హిందూపురం ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని మదీహ విజేతగా నిలిచిందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా విభాగంలో రాష్ట్ర సమాచార కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన పోటీలలో సైతం రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. కర్ణాటకలోని బెళగావిలో రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో వివిధ ఈవెంట్లలో వెంకటసాయి(ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల), వినూతలక్ష్మి(బాలయేసు డిగ్రీ కళాశాల హిందూపురం), గౌతమిశ్రీ(ఎస్‌వీడిగ్రీ కళాశాల అనంతపురం), దీపిక (కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనంతపురం), గిరివర్ష(బాలాజీ డిగ్రీ కళాశాల హిందూపురం) రామమూర్తి (కేటీఎస్‌ప్రభుత్వ డిగ్రీకళాశాల రాయదుర్గం), సుబ్రహ్మణ్యం(పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెనుకొండ), గణేష్(ఎస్కేయూ కాలేజీ ఆఫ్ ఫార్మసూటికల్ సైన్స్ ఎస్కేయూ), గదిలింగప్ప(ఎస్కేపీ డిగ్రీ కళాశాల గుంతకల్లు), స్వాతి బాయి(ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందూపురం) విజేతలు నిలవడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ సమైక్యత శిబిరానికి, ఐకాన్ అంతర్జాతీయ సదస్సుకు ఏపీ టీం కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించిన హిందూపురం ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులను ఈసందర్భంగా వీసీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ మురళీధర్ రావు పాల్గొన్నారు.

వైసీపీ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి


నివాళులు అర్పిస్తున్న అనంత వెంకటరామి రెడ్డి


తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి(ఫైల్)

అనంతపురం కలెక్టరేట్/ఆత్మకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి(70) మృతి చెందారు. శుక్రవారం ఆత్మకూరు మండలం తోపుదుర్తిలోని పొలంలో పనులు చేయిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కింద పడిపోయారు. వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. భాస్కర్‌రెడ్డి సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌పార్టీలో పనిచేశారు. ఆత్మకూరు మండల ఎంపీపీగా పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి సతీమణి తోపుదుర్తి కవిత జడ్పీ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి దంపతులు ఆ పార్టీలో చేరారు. భాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని నగరంలోని రామచంద్రనగర్‌లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నివాళి అర్పించారు. భాస్కర్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ రంగయ్య, గంగుల భానుమతి, మధుసూదన్‌రెడ్డి తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కర్‌రెడ్డికి కుమార్తె, కుమారుడు సంతానం.

గాయపడిన మహిళ మృతి

తలపై రాడ్డుతో బాదిన భర్త

చికిత్స పొందుతూ మృత్యువాత


మృతురాలు సుమియా, భర్త అల్తాఫ్‌ఖాన్ (ఫైల్)

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భర్త దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు పెనుకొండలోని కుమ్మరదొడ్డిలో నివాసముంటున్న ఇక్బాల్‌సాబ్, పర్వీన్‌ల కుమార్తె సుమియాబేగం(25)ను అదే వీధిలో నివాసముంటున్న అల్తాఫ్‌ఖాన్ ఏడేళ్ల కిందట ప్రేమించి, పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత ఎనిమిది నెలల నుంచి కుటుంబ కలహాలతో దంపతులిద్దరూ విడిగా ఉంటున్నారు. మృతురాలు సుమియాబేగం స్థానిక ఘనగిరి పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 26న పాఠశాలలోనే భార్యతో గొడవపడిన అల్తాఫ్‌ఖాన్ పిల్లలను తన నివాసానికి తీసుకెళ్లాడు. పిల్లలను ఏదైనా చేస్తాడన్న భయంతో సుమియాబేగం అక్కడికి వెళ్లింది. ఆ సమయంలో ఇద్దరి మధ్య గొడవ తీవ్రం కావడంతో అల్తాఫ్‌ఖాన్ ఇనుపరాడ్డుతో సుమియా తలపై బలంగా మోదాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భర్త అల్తాఫ్‌ఖాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

- ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నవాటిని వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ ఆదేశించారు. శుక్రవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ కార్యాలయంలో ఈఈ శ్రీనివాసులుతో కలిసి జిల్లాలోని డీఈలు, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాప్తాడు, శింగనమల డివిజన్‌లలోని పలు మండలాల్లో చోటు చేసుకున్న సమస్యలపై సంబంధిత ఏఈలకు క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది. వెంటనే పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా స్వచ్ఛభారత్ పనుల్లో భాగంగా చేపడుతున్న మరుగుదొడ్లు, అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణంతో పాటు వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేసి పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఈలు శ్రీరాములు, శ్రీధర్, రేహాన వసీం, చంద్రశేఖర్, కిరణ్ తేజ, రాంగోపాల్‌రెడ్డి, ఏఈలు శ్రీనివాసులు, హరికుమార్, శివకుమార్, వరలక్ష్మి, రవీంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మన్న, నాగేంద్ర, జనార్దన్, సుప్రజారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనాభాను అనుసరించి రిజర్వేషన్లు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్

గుంతకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణనతో పాటు కుల గణన కూడా చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సీట్లను కుదించారని అన్నారు. తెలంగాణాలో మాదిరిగా కుల గణన చేపట్టి, జనాభా లెక్కలను అనుసరించి బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం కూడా జనగణనతోపాటుగా కుల గణన చేపడతామని ప్రకటించినందున.. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కులగణన చేయాలన్నారు. దీనిపై ఈ నెల 14న విజయవాడలో అఖిలపక్ష పార్టీలు, కుల సంఘాల నేతలతో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్, సూపర్ హిట్ సదస్సులో బీసీల జపం చేసి, వారి రాజకీయ రిజర్వేషన్లపై ఏమీ చెప్పలేదన్నారు. చంద్రబాబు ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని అన్నారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అప్పగించే ఆలోచనలో ఉన్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకులు బి. గోవిందు, బి.మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగదీశ్

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రన్నింగ్‌లో మార్పు

గుంతకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే కాచిగూడ-యశ్వంతపూర్-కాచిగూడ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20703/04) రైళ్ల రన్నింగ్ నమూనాను మార్చినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు వారానికి ఆరు రోజులు నడుస్తున్నాయి. బుధవారం మినహా మిగిలిన ఆరు రోజులు రాకపోకలు సాగిస్తున్నాయి. డిసెంబరు 4వ తేదీ నుంచి బుధవారానికి బదులు శుక్రవారం తప్ప ఇతర రోజుల్లో ఈ రైళ్లు నడుస్తాయని పేర్కొన్నారు.

16 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 16 మండలాల్లో గురువారం వర్షం కురిసింది. అత్యధికంగా గుత్తి మండలంలో 27.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. పెద్దవడుగూరు 9.0, పుట్లూరు, నార్పల 6.4, గుంతకల్లు, వజ్రకరూరు 6.2, తాడిపత్రి 4.2, విడపనకల్లు 4.0, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం 3.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 2.4 మి.మీలోపు వర్షం కురిసింది. శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. గుంతకల్లులో ఓ మోస్తారు వర్షం పడింది. యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

1130 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇఫ్‌కో కంపెనీకి చెందిన 1130 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను ఏడీఏ శుక్రవారం పరిశీలించారు. జేసీ ఆదేశాల మేరకు... ఏపీ మార్క్‌ఫెడ్‌కు 580, సొసైటీలకు 220, ప్రైవేటు డీలర్లకు 330 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు.

జాబ్ మేళా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 15మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉపాధి కల్పన జిల్లా అధికారి పల్లవి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతపురం ఎంజీ బ్రదర్స్ హెచ్‌పీసీఎల్‌లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఉపాధి కల్పన కార్యాలయ అధికారులు, ఎంజీ బ్రదర్స్ కంపెనీ ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

15 నుంచి విద్యుత్ జేఏసీ ఆందోళనలు


ఎస్ఈకి వినతి పత్రం ఇస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ దశలవారీ ఆందోళనలకు సిద్ధమైంది. ఈనెల 15నుంచి ఆందోళనలు చేపట్టనున్నారు. ఆ మేరకు జిల్లా విద్యుత్ జేఏసీ నాయకులు విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్‌కు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15, 16 తేదీల్లో ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారన్నారు. 17, 18న అన్ని సర్కిల్ కార్యాలయాలు, జనరేటింగ్ స్టేషన్ల ఎదుట భోజన విరామ సమయంలో ధర్నాలు చేస్తామన్నారు. 19, 20న సర్కిల్ ఆఫీసులు, జనరేటింగ్ స్టేషన్ల ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామన్నారు. 22న జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ జి.టి. శ్రీనివాసులు, కో కన్వీనర్ రాఘవేంద్ర హర్ష, వైస్ ఛైర్మన్ కళ్యాణచక్రవర్తి, నాయకులు నాగార్జున, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా భవానీ రవికుమార్ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న భవానీ రవికుమార్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్ శుక్రవారం స్వచ్ఛ ఆంధ్రమిషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర ఛైర్మన్ పట్టాభిరామ్, మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన భవానీ రవికుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా బాధ్యతలను ప్రణాళిక ప్రకారం నిర్వర్తించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు. అనంతరం అనంతపురం నుంచి వెళ్లిన అభిమానులు, జనసేన పార్టీ నాయకులు భవానీ రవికుమార్‌తో కలిపి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛ ఆంధ్రమిషన్ రాష్ట్ర ఛైర్మన్ పట్టాభిరామ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, పలువురు కూటమి నాయకులు, చిరంజీవి యువత పెద్ద ఎత్తున హాజరై అభినందనలు తెలిపారు.

న్యూస్ బాక్స్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ శివరాం

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటనే ఆరోగ్యంగా ఉంటారని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ శివరాం అన్నారు. శుక్రవారం మండలంలోని రాచువారిపల్లిలో సీజనల్‌వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్ఓ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు, ప్రతిశుక్రవారం డ్రైడే పాటించి ప్రజలు జ్వరాల బారిన పడకుండా ఉండాలన్నారు. సూపర్‌వైజర్లు వెంకటరమణ, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తాడిమర్రి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తాడిమర్రి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1991-92 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు హెచ్ఎం అరుణ శుక్రవారం క్రీడా దుస్తులను అందజేశారు. పూర్వ విద్యార్థులు కుళ్లాయిరెడ్డి, నాగరాజు, కాటమయ్య, రామ్మోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, భగవంతరెడ్డి, శివారెడ్డి విద్యార్థుల కోసం క్రీడాదుస్తులు అందజేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో పాఠశాలకు సహాయ సహకారాలు అందించడానికి ముందుంటామన్నారు. ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేశ్, పీడీలు అమరాంజనేయులు,ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆహారంలో మార్పులతో పీసీఓడీని తగ్గించవచ్చు

ముదిగుబ్బ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సరైన వ్యాయామం, జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా పీసీఓడీని తగ్గించవచ్చని శ్రీవర్ష ఆస్పత్రి ఎండీ జనరల్ ఫిజీషియన్ సుప్రజ చౌదరి అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా, బాలికల హైస్కూల్‌లలో జాతీయ మానవ హక్కుల సౌత్ స్టేట్స్ గౌరవాధ్యక్షుడు బాసినేని వెంగమేష్ చౌదరి ఆధ్వర్యంలో పీసీఓడీ ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా అండ్ వెల్నెస్ కోచ్ డాక్టర్ గుర్రప్ప, మండల వైద్యాధికారి రాజేంద్ర, ఎంఈఓ రమణప్ప, హెచ్.ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న సర్వసభ్య సమావేశం

నల్లమాడ, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 23న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్నిశాఖలాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు. ఆయాశాఖల అధికారులు ప్రగతి రిపోర్టులతో హాజరుకావాలన్నారు.

రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు



ఇంట్లో సోదా చేస్తున్న పోలీసులు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేతిరెడ్డికాలనీ, ఇందిరమ్మకాలనీలో ఉన్న రౌడీషీటర్ల ఇళ్లలో శుక్రవారం టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు నిర్వహించారు. కాలనీలో ఎవరైనా అనుమానితులు తిరిగితే వెంటనే డయల్ 100కి ఫోన్‌చేయాలని కాలనీప్రజలను కోరారు. కొత్తవ్యక్తులకు ఇళ్లు బాడుగకు ఇచ్చేసమయంలో వారి ఆధార్‌కార్డు తనిఖీ చేసి ఇవ్వాలన్నారు. రౌడీషీటర్లు సత్ప్రర్తనతో జీవించాలని, మీపై నిఘా నిరంతరం ఉంటుందన్నారు.

మహిళల మధ్య గొడవ.. కేసు నమోదు

ధర్మవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చెత్త ఊడ్చే విషయంలో ఇద్దరి మహిళల మధ్య జరిగిన గొడవలో ఒకరిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన పూజారి జయలక్ష్మి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. జయలక్ష్మి ఇంటివెనుక లక్ష్మీదేవి అనే మహిళ చెత్తను ఊడ్చేవిషయంలో తరచూ గొడవ పడేది. అయినా జయలక్ష్మి పట్టించుకోకుండా ఉండేది. 8వతేదీన జయలక్ష్మి ఇంటిలో ఉండగా లక్ష్మీదేవి చెత్త విషయంలో గొడవపడి నానా దూర్భాషలాడింది. జయలక్ష్మి అవేమి పట్టించుకోకుండా ఇంట్లోకి వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం లక్ష్మీదేవి, ఆమె కుమార్తె రాధ కోడలు జయలక్ష్మి ఇంట్లోకి దూరి బూతులు తిడుతూ దాడిచేశారు. గమనించిన చుట్టు పక్కల వారు మంజుల, ఆమె భర్త చంద్ర విడిపించారు. అనంతరం జయలక్ష్మి భర్త లక్ష్మీనారాయణకు ఫోన్‌చేయడంతో ఆయన వచ్చి జయలక్ష్మిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శుక్రవారం లక్ష్మీదేవి, ఆమె కుమార్తె, కోడలిపై టూటౌన్‌పోలీసులకు జయలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తచెరువు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని అక్కమ్మగారి కొండ మలుపు వద్ద బుక్కపట్నం రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి గ్రామానికి చెందిన బాలు, చరణ్ కొత్తచెరువునుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో బుక్కపట్నం వైపు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేకు వేయడంతో ద్విచక్రవాహనం కారును ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

బుక్కపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో ఐదుగురు పారిపోయినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి ఐదు ద్విచక్రవాహనాలు, రూ.8,120 స్వాధీనం చేసుకున్నామన్నారు.

జిల్లా అభివృద్ధికి మార్గదర్శి కలెక్టర్ చేతన్: ఎమ్మెల్యే



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ టీఎస్ చేతన్ తనదైన ముద్రవేసి గుర్తింపు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కొనియాడారు. శుక్రవారం కలెక్టర్ బదిలీపై వెళుతుండగా ఏర్పాటుచేసిన వీడ్కోల కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్ చేతన్ బదిలీ బాధాకరమైనా, బదిలీలు సాధారణమన్నారు. ప్రజాప్రతినిధులకు అధికారులకు కలెక్టర్ సమన్వయకర్తగా వ్యవహరించి అభివృద్ధికి కృషిచేశారన్నారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల ఏర్పాట్లపై, నిధుల మంజూరుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అనంతరం కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. కూటమిపార్టీ నాయకులు సామకోటి ఆదినారాయణ, గంగాధర్ నాయుడు, ఓబులేసు, సురేష్‌చౌదరి, పాల్గొన్నారు.

తాగునీటి పథకాన్ని త్వరితగతిన చేపట్టండి: మున్సిపాలిటీలో సమగ్ర తాగునీటి పథకాల పనులను త్వరితగతిన పూర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మున్సిపల్ పబ్లిక్‌హెల్త్ ఇంజనీర్, కమిషనర్ క్రాంతికుమార్‌కు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో మున్సిపల్ మాజీమంత్రితో కలసి ఎమ్మెల్యే తాగునీటి పథకం అభివృద్ధిపనులపై సమీక్షించారు. తాగునీటి పథకానికి రాష్ట్రప్రభుత్వం పురపాలక శాఖ నుంచి రూ.136 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.100 కోట్లు మంజూరైన తాగునీటి పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. బాబా శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో సమగ్ర తాగునీటి పథకం పనులను పూర్తీచేసేలా పనులు చేయాలని సూచించారు. పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ క్రాంతికుమార్, పబ్లిక్‌హెల్త్ డీఈ నరసింహమూర్తి పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం: పేద కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు కొం డంత అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 24 మంది కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.24,12,816 చెక్కులను లబ్ధిదారులకు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి ఎమ్మెల్యే అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలోనే నియోజకవర్గంలో 112 మందికి రూ.1.27 కోట్లను పేదలబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందచేసినట్లు తెలిపారు. టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏచూరి ఆశయాలను కొనసాగిద్దాం: సీపీఎం



కదిరిలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కదిరిఅర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అమీన్‌నగర్‌లో పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెల వద్ద ఏచూరి ప్రథమ వర్ధంతి సభ ఏర్పాటు చేశారు. జిల్లా కమిటీ సభ్యులు హరి అధ్యక్షతన జరిగిన ఈసభకు ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పేదలు కేవలం రెండు సెంట్లు స్థలం కోసం రెండు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకున్నట్లు చెప్పారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. పెద్దన్న, సాంబశివ, రామమోహన్, నారాయణ, శాంతిబాయి, మారుతి, నాగిరెడ్డి, శివన్న, శ్రీరాములు, కదిరప్ప, పోతులయ్య పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు(ఆంధ్రజ్యోతి): సీతారం ఏచూరి వర్ధంతిని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. వెంకటరమణ, కుళ్లాయప్ప రామక్రిష్ణ, సురేష్, తిరుపాల్, ఆంజి పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్ (ఆంధ్రజ్యోతి): సీతారాం ఏచూరి సేవలు మరవలేనివని సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, జేవీ రమణ అన్నారు. ఏచూరి ప్రథమ వర్ధంతిని శుక్రవారం సీపీఎం కార్యాలయంలో వారు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయూబ్‌ఖాన్, ఆదినారాయణ, హైదర్‌వలి, వెంకటస్వామి, అమన్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● బీసీ సంఘం అధ్యక్షురాలు జయశ్రీ



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీసీ సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద బీసీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీ కులగణన చేసి, జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. ఆమెతోపాటు బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, నామాల శంకర్, తిరుపతయ్య, వెంకటరమణ, గిరిరాజు రవి, బండి వెంకటేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ అధ్యక్షుడిగా సుదర్శన్ రెడ్డి



సుదర్శన్‌రెడ్డి



వెంకటక్రిష్ణారెడ్డి

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజకవర్గ రెడ్డి జేఏసీ అధ్యక్షుడిగా ఇల్లూరి సుదర్శన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా ఎల్ఐసీ వెంకటక్రిష్ణారెడ్డిని నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ కమిటీలు పూర్తిచేస్తున్నామని, పార్టీలకతీతంగా 20సంవత్సరాలుగా రెడ్ల సంక్షేమం కోసం ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తూ ఎన్నో విజయాలను సాధించామని తెలిపారు. ఎంపికైన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పొగాకును నివారిద్దాం: ఎంఈఓ

తాడిమర్రి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పొగాకును నివారించేందుకు అంగడి యజమానులు సహకరించాలని ఎంఈఓ క్రిష్ణమోహన్ కోరారు. శుక్రవారం తాడిమర్రి ప్రధాన వీధుల్లో ఉన్న షాపుల వద్దకు వెళ్లి పొగాకుతో తయారుచేసే వస్తువులను వాడటం వల్ల దుష్పరిణామాలను వివరించారు. దీనికి అందరు సహకరించాలని ఆయన కోరారు. పాఠశాల హెచ్ఎం అరుణ, పీడీ రామాంజనేయులు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

తనకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారి గణేష్‌రెడ్డి కంటి పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మునలిరెడ్డి, సీహెచ్ఓ మంజుల, ఏఎన్ఎం రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ప్రజా సేవకుడు మంత్రి సత్యకుమార్

● బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్



పార్టీలో చేరిన వారితో హరీష్‌బాబు, నాయకులు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకుడు మంత్రి సత్యకుమార్ అని, నియోజకవర్గానికి ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం ధర్మవరం పట్టణంలోని 25వ వార్డు పార్థసారథినగర్‌కు చెందిన టీఎం అశ్వత్థనారాయణ, వారి మిత్రబృందం బీజేపీలోకి చేరారు. వీరికి హరీష్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. ప్రజల అభివృద్ధే ధ్యేయంగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ కృషి చేస్తున్నారన్నారు. బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర, పోతుకుంట రాజు, శ్యామ్‌రావు, నబీరసూల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంబరాలు



కేక్ కట్‌చేస్తున్న అంగన్‌వాడీలు, టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీ సెంటర్లను సీఎం చంద్రబాబు మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో శుక్రవారం కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేస్తున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. కార్యకర్తలు ఎన్‌డీఏ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృ తజ్ఞతలు తెలిపారు. నాయకులు మల్లెల నారాయణస్వామి, కొలసాని చం ద్ర, రాధమ్మ, కార్యకర్తలు రజియా, పుష్ప పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి భానుప్రకాష్ నాయక్ సూచించారు. వ్యాధులు ప్రబలకుండా తిప్పేపల్లితండా, తిప్పేపల్లి, బాబాసాహెబ్‌పల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి దేవలానాయక్, సీహెచ్ఓ ప్రమీల, రామక్రిష్ణమ్మ, హేమలత, సిబ్బంది అరుణ, ప్రభాకర్, బాలజీ, గోపాల్‌నాయక్, మంజుల, లక్ష్మీదేవి, రమాదేవి పాల్గొన్నారు.

పీఆర్సీని నియమించాలి: ఏపీటీఎఫ్



పుట్టపర్తిలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే నియమించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి, ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తికి వినతి పత్రం అందచేశారు. రాజశేఖర్, నరేష్‌చౌదరి, సుధాకర్, లక్ష్మీపతి, చెన్నానాయక్, రవీంద్రారెడ్డి, రాజగోపాల్, శంకర్‌రెడ్డి రవిశంకర్, వెంకట రమణనాయక్, శ్రీనివాసులు, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు రాంకుమార్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, బకాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి అందించారు. చిరంజీవి, చంద్రమౌలిరాజు, అంజన్‌రెడ్డి, చంద్ర పాల్గొన్నారు. దసరా సెలవులు 24 నుంచి ఇవ్వడం సరికాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం, రాష్ట్ర నాయకులు షర్ఫోద్దిన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 22 నుంచి సెలవులు ప్రకటించాలని, మధ్యంతర భృతిని వెంటనే ఇవ్వాలన్నారు.

కొత్తచెరువు(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ బాలాంజనేయులుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్. చంద్ర, పూర్వపు అధ్యక్షుడు పీవీమాధవ, చెన్నకేశవులు, అక్కులప్ప, ఈశ్వరప్ప, రంగయ్య, ప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కారించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ టీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు, జేస్నే నాగప్ప, ఉమాపతి, పెద్దారెడ్డి, శ్రీనివాసులు, వాసుశంకర్, శివానంద, ఈశ్వరయ్య, గోపి, అంజినాయక్ పాల్గొన్నారు.

నల్లమాడ(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సాయిదీప్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. వెంకటరామిరెడ్డి, త్రిమూర్తితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

బత్తలపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. మండలంలోని రామాపురం గ్రామ జడ్పీ పాఠశాలలో శుక్రవారం ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను పరిటాల శ్రీరాం ప్రారంభించారు. అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు పాఠశాల దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలు ఎంత బాగా ఆడితే అంత ఆరోగ్యాంగా ఉంటామన్నారు. జాతీయ స్థాయిలో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. డైరక్టర్ గోనుగుంట్ల విజయ్‌కుమార్, నారాయణరెడ్డి, ఉమాపతి నాయుడు, కేశవ, రమణ, మోహన, అప్పస్వామి, అశోక్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

తాడిమర్రి(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెద్దకోట్ల గ్రామానికి చెందిన మోపురెడ్డిని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ శుక్రవారం పరామర్శించారు. బత్తలపల్లి ఆర్డీటీ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా అక్కడికి వెళ్లి పరామర్శించి స్థానిక వైద్యులతో ఆరాతీశారు. అనంతరం బాధితునికి రూ.20వేలు ఆర్థికసాయం అందించి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూచి రాము, హర్షవర్ధన్, భాస్కర్‌గౌడ్, గణేశ్, పక్కీర్‌రెడ్డి, వీరాంజి, క్రిష్టయ్య, పెద్దపార్థ పాల్గొన్నారు.

కార్యకర్తలు సేవాభావంతో పనిచేయాలి

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు, నాయకులు సేవాభావంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సేవాపక్షోత్సవాల కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాపు, గుడెసె దేవానంద్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 17 నుంచి అక్టోబరు 2 జాతిపిత మహాత్మగాంధీ జయంతి వరకు సేవాపక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశానికి, సమాజానికి నిస్వార్థసేవలను ప్రజలకు మరోసారి చాటిచెప్పే గొప్ప అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభిస్తోందన్నారు. పార్టీ ఆదర్శాలు, సమాజానికి అందించే సేవలను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కళాణ్‌కుమార్, తలుపుల గంగాధర్, రమేష్‌రెడ్డి, హరిక్రిష్ణ, అమరదేవేంద్ర, సాకే ఓబులేసు, జ్యోతిప్రసాద్, సునీల్, ఎల్వీ రమేష్‌బాబు, సురేంద్రబాబు, డోలా రాజరెడ్డి, కుసుమ జయరాం, కొండమరాజు, బాలగంగాధర్, రామాంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.

సహకార సంఘం అధ్యక్షుడి ఎంపిక



చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు సహకార సంఘ బ్యాంకు చైర్మన్‌గా మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, సభ్యులుగా పోతుకుంట రవికుమార్, గుద్దిటి వెంకటేష్‌ను నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారం గాంధీనగర్ టీడీపీ కార్యాలయంలో చైర్మన్‌తో పాటు సభ్యులను, నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన రాళ్లపల్లి షరీఫ్‌ను క్లస్టర్ ఇన్‌చార్జి మహేష్‌చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల మాజీ కన్వీనర్ గొట్లూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి విజయసారథి, తెలుగుయువత విజయ్‌చౌదరి, డీలర్లు గవ్వల రామాంజనేయులు, క్రిష్ణ, ఐటీడీపీ రాము, హరి పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జెస్ట్ రైట్స్ సంస్థ ప్రతినిధులు

కదిరిఅర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అక్బరీయా మసీదులో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెస్టురైట్స్ సంస్థ సహకారంతో సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల అనారోగ్య సమస్యలతోపాటు, కుటుంబ సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నా, అక్కడక్కడా బాల్యవివాహాలు జరుగుతుండడం విచారకరమన్నారు. ఇస్లాం మత పెద్దలు మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టి పిల్లలు ఆరోగ్యంగా, హుందాగా, గౌరవంతో పెరిగేలా చూసుకోవడం మన బాధ్యత అన్నారు. ఇస్లాంలో బాల్యవివాహాలకు చోటు లేదన్నారు. సంస్థ ప్రతినిధులు ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులనాయుడు, మత పెద్దలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే శిశువులకు ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ జయంతి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన చిన్నారులకు జన్మనిస్తారని సీడీపీఓ జయంతి గర్భిణులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నిడిమామిడిలో పౌష్టికారహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా గర్భవతులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ లత, ఐసీడీఎస్ సిబ్బంది వనజాక్షి, మహిళా సంరక్షణ కార్యదర్శి బేబీరాణి అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగు పడింది..!

మందుగుండు సామగ్రి పరిశ్రమ ఏర్పాటులో కీలక పరిణామం

ఎన్ఎస్ఈకి లేఖ రాసిన ఆగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ లిమిటెడ్

ఆర్ అనంతపురం వద్ద ఏర్పాటుకానున్న పరిశ్రమ



పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతంలో భూమిని చదును చేస్తున్న దృశ్యం

మడకశిర టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రాంతంలో ఏపీఐఐసీ నుంచి భూమి కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) కు ఈనెల 4న భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ అయిన ఆగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ లిమిటెడ్ అధికారికంగా తెలియజేసింది. దీంతో మందుగుండు సామగ్రి పరిశ్రమ ఏర్పాటుకు ముందడుగు పడినట్లైంది. మడకశిర సమీపంలోని ఆర్.అనంతపురం వద్ద ఆగ్నేయాస్త్ర ఎనర్జెటిక్స్ లిమిటెడ్ మందుగుండు భారీ పరిశ్రమ ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే ఒప్పందం కూడా కుదిరింది. ఈనేపథ్యంలో ఆ సంస్థకు ఆర్ అనంతపురం వద్ద 949.65 ఎకరాలు కేటాయించేందుకు ఏపీఐఐసీతో ఒప్పందం కుదిరింది. ఈమేరకు రూ.2400 కోట్లతో అత్యాధునిక రక్షణ రంగ ఉత్పత్తుల కేంద్రం ఇక్కడ ఏర్పాటు కానుంది. ఈ పరిశ్రమలో క్షిపణులు, రాకెట్లు, ఫిరంగి గుండ్లతో పాటు మందుగుండు సామగ్రి నింపే ప్లాంట్, గన్‌ప్రొపెల్లెంట్ సౌకర్యం, క్షిపణి వ్యవస్థలు, అంతరిక్ష ప్రయోగ వాహనాలు తయారు చేయనున్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 550మందికి, పరోక్షంగా 1000మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇక్కడ తయారైన రక్షణ రంగ ఉత్పత్తులను దేశీయ అవసరాలకే కాక ప్రపంచ దేశాలకు సైతం ఎగుమతి చేయనున్నారు. దీంతో ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరిశ్రమలు తెస్తామన్న హామీ కూడా నెరవేరినట్లు అవుతోంది. త్వరలోనే పరిశ్రమ ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నట్లు సమచారం. ఇప్పటికే పరిశ్రమ ఏర్పా టు చేసే ప్రాంతంలో భూమిని చదును చేస్తున్నారు. దీంతో పనుల ప్రారంభానికి త్వరలో తేదీలు ఖరారు కానున్నట్లు సమాచారం.



ఆర్. అనంతపురం వద్ద ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్క్

నిరుద్యోగులకు వరం



మా గ్రామ సమీపంలో మందుగుండు భారీ పరిశ్రమ ఏర్పాటు కావడం సంతోషంగా ఉంది. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఇలాంటి పరిశ్రమలు మా ప్రాంతంలో ఏర్పాటు కావడం మాలాంటి వాళ్ల అదృష్టంగా భావిస్తున్నాం. పారిశ్రామిక అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు వల్ల సాధ్యపడుతుందని మాలాంటి నిరుద్యోగ యువత విశ్వసిస్తోంది. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి మాలాంటి నిరుద్యోగులకు ఉపాధిని స్థానికంగా కల్పించాలి.

- పీఆర్ మురళిబాబు, జమ్మానిపల్లి

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

రూ.లక్షలు ఖర్చు చేసి వదిలేస్తున్న వైనం



నిరుపయోగంగా కమర్షియల్ సేల్స్ ట్యాక్స్ కార్యాలయం

చిలమత్తూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలు అందించేందుకు నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటివైపు చూసేవారు కరువవ్వడంతో మట్టిపాలు అవుతున్నాయి. మండలంలో ఇలాంటి భవనాలు పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. గతంలో వాణిజ్య పన్నుల శాఖకు చెందిన కార్యాలయం కొడికొండ చెక్‌పోస్టులో ఉండేది. దాని కోసం ప్రభుత్వం పక్కా భవనాన్ని లక్షల ఖర్చు చేసి నిర్మించింది. అయితే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమల్లోకి తీసుకురావడంతో ఆ కార్యాలయ నిర్వహణను ఆపేశారు. గత 8 ఏళ్లుగా ఈ భవనం మూతపడింది. అప్పటి నుంచి ఈ భవన చూసేవారు లేకపోవడంతో ఇప్పుడు ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. లక్షల ఖర్చు చేసిన ఈ భవనం ఇతర సేవలకు ఉపయోగించుకొని ఉంటే శిథిలావస్థకు చేరుకునేది కాదు. కానీ ఆ దిశగా అధికారులు చరర్యలు తీసుకోకపోవడంతో ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. అదేవిధంగా ఒకప్పుడు కొడికొండ చెక్‌పోస్టుకి ఐకాన్‌గా నిలిచిన ఏపీ టూరిజం హరిత రెస్టారెంట్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. 2005లోనే రూ. 60 లక్షలతో నిర్మించిన భవనం ఇప్పుడు శిథిలమవుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే మండలంలో పదుల సంఖ్యలో మంచిగా ఉన్న భవనాలు ఆలనాపాలన కరువవడంతో శిథిలమవుతున్నాయి. కొడికొండ చెక్‌పోస్టులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బలిజపల్లి, నంజిరెడ్డిపల్లి, సుబ్బరావుపేట, ముద్దపల్లి, వై.గొల్లపల్లి, దాదిరెడ్డిపల్లి తండా, మాదిరెడ్డిపల్లి గ్రామాల్లో మూతపడిన భవనాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని విద్యుత్ శాఖకు సంబంధించిన వసతి గృహాలు, పోలీస్ శాఖకు సంబంధించిన వసతి గృహాలు శిథిలమయ్యాయి. దీంతో కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. ప్రజలకు సేవలు అందివ్వడం కోసం నిర్మించిన భవనాలు కళ్లెదురుగానే పాడవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వాటిపై దృష్టి పెట్టి ప్రభుత్వ భవనాలను ప్రజాసేవ నిమిత్తం ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ప్రత్యామ్నాయాలకు ఉపయోగించాలి

ప్రజా అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు కొన్ని కారణాలతో మూతపడ్డాయి. అయితే ఆ భవనాలను అలాగే వదిలేయకుండా వాటిని ఇతర ప్రత్యామ్నాయ అవసరాలకు ఉపయోగిస్తే మంచిదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్న భవనాలను అలాగే వదిలేస్తే శిథిలమవడం తప్ప ఏ మాత్రం ఉపయోగం ఉండదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏ శాఖకు అవసరమైనా వాటిని ఉపయోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందని అంటున్నారు. రూ. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు ఇలా శిథిలమవుతుండటంతో ప్రజాధనం వృథా అవుతోందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఇటువంటి ప్రభుత్వ భవనాల వైపు అధికారులు దృష్టి సారించి వాటిని ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

- బహుజన చైతన్య వేదిక

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని బహుజన చైతన్యవేదిక అధ్యక్షులు శివరామక్రిష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో వివిధ ప్రజాసంఘాల నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలు ఏర్పాటు చేయడం ఆ మహనీయులకు మనమిచ్చే గౌరవమన్నారు. విగ్రహాలు ఏర్పాటుచేయాలని ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బాబుప్రసాద్, రవికుమార్, సూరీ, నాగరాజు, నరసింహులు, రామాంజినేయులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అగళి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత, మోడల్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు జాతీయ ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50లక్షలు మించకుండా ఉండాలన్నారు. ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం: చైర్మన్

హిందూపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శుక్రవారం పరిగి బస్టాండులో పే అండ్ యూస్ టాయ్‌లెట్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్‌కు బస్టాండుకు వచ్చే వివిధ ప్రాంతాలవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, రాఘవేంద్ర, ఇర్షాద్, నాయకులు నవీన్, సుమోశీన, డైమండ్‌బాబా, ప్రవీణ్‌కుమార్, అన్వర్ పాల్గొన్నారు.

కేరళ అర్బన్ కాంక్లేవ్‌కు 'పురం' కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్

హిందూపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో జరిగిన కేరళ అర్బన్ కాంక్లేవ్ కార్యక్రమానికి హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల్లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఎలా అభివృద్ధి చెందుతున్నాయి..? భవిష్యత్తులో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటే అభివృద్ధి సాధ్యం.. తదితర విషయాలపై మున్సిపల్ కమిషనర్లు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కమిషనర్ మల్లికార్జున పట్టణాభివృద్ధిపై మాట్లాడారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పులకుంట గ్రామంలో మృతిచెందిన అనాథ మహిళా మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం మహిళ మృతిచెందింది. అయితే బంధువులెవరూ రాకపోవడంతో రూరల్ పోలీసులు యుగంధర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

సమస్యలను పరిష్కరించాలని నిరసన



మడకశిరలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిరసనలు జరిగాయి. బకాయి ఉన్న 4 డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఓపీఎస్ అమలు చేయాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. గోరంట్ల, సోమందేపల్లి, పరిగి, మడకశిర తదితర ప్రాంతాల్లో ఏపీటీఎఫ్ నాయకులు నిరసనలు తెలిపారు. తమ డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

- న్యూస్‌నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి)

రణభేరిని విజయవంతం చేయండి: యూటీఎఫ్

పెనుకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జయభేరి కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి విద్యారంగ సమస్యలు, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్న డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుంచి 19 వరకు రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెనుకొండ, రొద్దం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేంద్ర, మూర్తి, గంగాధర్, రవీంద్రనాథ్, నబీ, రమేష్, రామాంజినేయులు, గోవిందప్ప పాల్గొన్నారు.

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లిస్తూ, 12వ పీఆర్సీ అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి క్రిష్టప్ప, మురళి, రామాంజనేయులు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

దాడిలో వృద్ధుడి మృతి

పావగడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దాడిలో వృద్ధుడు మృతిచెందాడు. తాలూకా పరిధిలోని బెళ్లిబెట్టు గ్రామంలో వాల్మీకి ద్విచక్రవాహనంపై వస్తుండగా బాలాజీ అనే బాలుడు వాహనానికి అడ్డువచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురైన వాల్మీకి ఆ బాలుడిని చితకబాదాడు. ఆ బాలుడు తండ్రి వెంకటేశ్, తల్లి రూప, తాత హనుమంతరాయప్ప, అవ్వ లక్ష్మీదేవమ్మ ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించగా ఆవేశంతో వాల్మీకి వారిపై దాడిచేశాడు. కట్టెతో కొట్టడంతో హనుమంతప్ప మృతి చెందగా మిగతా వారు గాయపడ్డారు. సీఐ గిరీష్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలల హక్కులపై అవగాహన

గోరంట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సీడీపీఓ శాంతలక్ష్మి సూచించారు. శుక్రవారం పులేరు ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ బాలబాలికలకు లింగసమానత్వం, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా జంక్‌ఫుడ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. సమస్యలు ఎదురైతే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, మేఘనా, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

మడకశిర టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడ్‌యాప్ సంయుక్తంగా ఉచిత టైలరింగ్ శిక్షణను ఇవ్వనున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. మూడు నెలల పాటు టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి అయిన వారు రుణసదుపాయం పొందవచ్చన్నారు. ఆధార్‌కు ఫోన్‌నెంబర్ లింక్ అయి ఉండాలని, ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిగ్రీ కళాశాలలో శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రొద్దం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తురకలాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్‌లైన్లకు మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసమూర్తి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. తురకలాపట్నం, రొద్దం, దొడగట్ట, రాగిమేకలపల్లి, పెద్దమంతూరు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో సమస్య ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

● పెనుకొండ టౌన్: పట్టణంలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైను మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9-30గంటల నుంచి మధ్యాహ్నం 2-30వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు పట్టణంలోని వజ్రాలపేట, న్యూకాలనీ, ఎన్టీఆర్‌కాలనీ, రైల్వేస్టేషన్, నాగులకట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పాడి రైతులకు శిక్షణ

రొళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాకి పంచాయతీలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ ఏడీ అమర్ పాడి రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తికి ఇవ్వాల్సిన ఆహారం, దాణా, వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తదితర అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పెనుకొండ ఏడీ శివశంకర్‌నాయక్, ఉమ్మడి జిల్లా డెయిరీ మేనేజర్ నారాయణమ్మ, బ్యాడిగెన డెయిరీ కార్యదర్శి కాంతరాజు, కాకి రంగనాథ్, పాడి రైతులు పాల్గొన్నారు.

బాగా చదివి కళాశాలకు పేరుతేవాలి

ఫ్రెషర్స్ డేలో ప్రిన్సిపాల్ గంగాధర్



సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ దృశ్యం

పెనుకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బాగా చదివి కళాశాలకు మంచి పేరు తేవాలని ప్రిన్సిపాల్ గంగాధర్ సూచించారు. స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్నేహపూర్వవాతావరణంలో కష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరుతేవాలన్నారు. విద్య అనేది జీవితాన్ని వెలిగించే దీపమని వ్యక్తిత్వం వికాసానికి మార్గమని అన్నారు. కార్యక్రమంలో ఏఓ కేశవయ్య, అధ్యాపకులు బాబు, మంజునాథ్, మల్లికార్జున, చెన్నకేశవ, రవినాయక్, రమ్యకళ పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వీధి కుక్కలు పట్టివేత

పెనుకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కుక్కల బెడద ఎక్కువైందని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో వాటి పట్టివేతకు చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం పుట్టపర్తిలోని కరుణా సొసైటీ ఆధ్వర్యంలో కుక్కలను పట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కరుణా సొసైటీవారు పట్టిన వీధికుక్కలను పుట్టపర్తిలో కుని ఆపరేషన్లు చేయించి ఏడు రోజుల తరువాత వ్యాక్సినేషన్ చేయించి తిరిగి వదిలేయడం జరుగుతుందన్నారు.

సేవ్ ఆర్డీటీ కరపత్రాలు విడుదల

పెనుకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 15న జరగనున్న సేవ్ ఆర్డీటీకి సంబంధించి పోస్టర్లను దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు శుక్రవారం విడుదల చేశారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఐక్యవేదిక నాయకులు రామాంజినేయులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, మూర్తి ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. సేవ్ ఆర్డీటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హంటర్ ప్రసాద్, జయశంకర్, బొక్సంపల్లి నారాయణ, మూర్తి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

అమరాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కెంకెర గ్రామ పొలిమేర చింతమానుకట్ట సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారం అందుకుని మడకశిర రూరల్ సీఐ రాజకుమార్ తన సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించారు. పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.18, 200, ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా 11 మంది పరారైనట్లు సీఐ తెలిపారు. దాడుల్లో స్థానిక ఎస్ఐ ఇషాక్‌బాష, ఏఎస్ఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుళ్లు మంజునాథ్, శ్రీనివాసులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2వార్డుకు చెందిన రాజు శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ కలహాల కారణంగా రాజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మడకశిర రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు రేకుల కుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు గిరిజమ్మ తెలిపారు. బుక్కపట్నంలో జరిగిన ట్రెడిషినల్ స్టోరీ టెల్లింగ్ విభాగంలో 9వ తరగతి విద్యార్థులు షాన్విక, చందన, మానస రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుర్రకథ రూపంలో వారు తమ ప్రతిభను చాటారని హెచ్‌ఎం తెలిపారు.

'సమస్యల పరిష్కారానికే పల్లెబాట'

హిందూపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించడానికే పల్లెబాట చేపట్టినట్లు ఎమ్మెల్యే పీఏ వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం మండలం కిరికెర గ్రామ పంచాయతీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, ఎంపీడీఓ సరస్వతి, మండల కన్వీనర్ హెచ్ఎన్‌రాము, నాయకులు అంజి, ముస్తఫ, ప్రకాశ్, వీవర్స్‌కాలనీ ఆంజనేయులు పాల్గొన్నారు.

వడిసలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మడకశిర టౌన్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరాపురం బస్టాండ్ ఆవరణంలో వెలసిన వడిసలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అదేవిధంగా పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేషంగా పూజలు చేశారు. కొల్హాపురమ్మ, గంగాభవాని, పూజమ్మ, మూలకంఠేశ్వరి తదితర ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కాంప్లెక్స్ క్రాస్‌రోడ్డు నుంచి ట్రెడ్స్ షోరూం వరకు డ్రైనేజీ కాలువ ఏర్పాటుకు టీడీపీ నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. రూ. 30లక్షల నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు సోముశేఖర్, నాగేనాయక్, నిమ్మల విద్యాధరణి, నిమ్మల శ్రీధర్, ఉమ్మర్‌ఖాన్, రామచంద్రారెడ్డి, శీనా, గిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చర్చ ఏదీ..?

హడావుడిగా ముగిసిన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరత్నమ్మ

లేపాక్షి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరయ్యారు. సమావేశం 11.30గంటలకు ప్రారంభమై 12గంటలకు ముగించేశారు. ప్రజా సమస్యలపై గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య, రోడ్లు, మౌలిక వసతులపై మాట్లాడాలనుకున్న ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. మండల పరిషత్ నిధులు రూ.92లక్షల ఉండగా అధికారులు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై నిలదీస్తామన్న సమాచారంతోనే అధికారులు హడావుడిగా సమావేశాన్ని ముగించినట్లు ప్రజాప్రతినిధులు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంపీపీ వెంకటరత్నమ్మ, ఎంఈఓ నాగరాజునాయక్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే వడ్డెర్లకు న్యాయం'



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరత్నమ్మ

చిలమత్తూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందని నాయకులు అన్నారు. శుక్రవారం కోడూరు తోపులో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవిని సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంతోనే వడ్డెర్లకు రాజకీయ, సామాజిక చైతన్యం కలిగిందన్నారు. అణగారిని వర్గాలకు రాజకీయ పదువులు ఇచ్చి గౌరవించిన ఘనత టీడీపీదేనన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, మీసేవ సూరి, కోడూరు సింగిల్ విండో అధ్యక్షులు నాగార్జున, గంగాధరప్ప తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

పరిగి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల స్పోర్ట్స్ స్థానిక సేవామందిరం ఐకాన్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. క్రీడల్లో విజేతలకు శుక్రవారం బహుమతుల ప్రదానం జరిగింది. పోటీల్లో హిందూపురం, పరిగి మండల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. త్రోబాల్ పోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచారు. వాలీబాల్‌లో అమర్ విద్యామందిరం విజేతగా నిలిచింది. ఖోఖోలో నారాయణ పాఠశాల, కబడ్డీలో అమర్‌విద్యామందిరం ప్రథమస్థానం పొందారు. ముఖ్య అతిథులుగా ఎస్ఐ రంగడుయాదవ్, ఎంఈఓ గంగప్ప, రిటైర్డ్ పీడీ బ్రహ్మయ్య హాజరై విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సురేష్, బాబాఖాన్, ప్రిన్సిపాల్ ఫైడిశెట్టి, వెంకట్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీతారాం ఏచూరి

గోరంట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతి సీతారాం ఏచూరి అని, ఆయన ఆశయాలు కొనసాగించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య అన్నారు. మండలంలోని పాలసముద్రం సీపీఎం కొత్తకాలనీలో ఏచూరి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన దేశ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆంజనేయులు, అశ్వర్థమ్మ, వెంకటలక్ష్మమ్మ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.